క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



నందిపేట్ (ఆర్మూర్): నందిపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నిజామాబాద్‌లోని ప్రతిభ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ సాంబార్ వాణి తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



మాక్లూర్: మదన్‌పల్లి తండా, క్యాంప్, సట్లాపూర్ తండాలలో శుక్రవారం మండల పశువైద్యాధికారులు ఉమా సహేర్, కిరణ్‌దేశ్‌పాండే ఆధ్వర్యంలో పశువైద్య సిబ్బంది 444 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. గ్రామాల వారీగా జరుగుతున్న ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యులు సూచించారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన



మాక్లూర్ : అడవి మామిడిపల్లిలో శుక్రవారం బీజేపీ కిసాన్ మోర్చా నాయకుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. సరైన తేమ శాతం వచ్చినా కొనుగోళ్లు చేపట్టడం లేదని రైతులు చెప్పటంతో వెంటనే డీసీవో శ్రీనివాస్‌తో ఫోన్లో మాట్లాడారు. హమాలీల కొరత ఉన్నందున జాప్యం జరుగుతుందని శనివారం నుంచి కాంటాలు జరిపిస్తానని చెప్పటంతో రైతులు ఒకింత సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట బీజేపీ మండల నాయకులు గంగోనే సంతోష్, చింత ప్రవీణ్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి, గంగోనే వినోద్ ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన



పెర్కిట్(ఆర్మూర్) : ఆలూర్ మండలం మిర్ధాపల్లిలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఎంపీడీవో గంగాధర్ శుక్రవారం పరిశీలించారు. మిర్ధాపల్లి గ్రామానికి ఇందిరమ్మ ఇళ్ల పథకంలో 127 మందికి ఇళ్లు మంజూరయ్యాయి. కాగా ప్రస్తుతం కొన్ని పునాది స్థాయిలో, మరికొన్ని పిల్లర్ల దశలో ఉన్నాయి. మిగతా లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా ప్రారంభించేలా చూడాలని గ్రామ కార్యదర్శులకు ఎంపీడీవో సూచించారు. జీపీ కార్యదర్శి నవీన్, నాగేంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



నందిపేట్ (ఆర్మూర్): కంఠం గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. హైదరాబాదులో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. రోడ్డు విస్తరణ పనులకు తగినన్ని నిధులు మంజూరు చేయాలని కోరారు. నేతలు దినేష్, పోశెట్టి, చిరంజీవి, రాజు గ్రామస్తులు పాల్గొన్నారు

మోడల్ స్కూల్‌లో అడ్మిషన్‌కు రేపు ప్రవేశ పరీక్ష

రుద్రూర్: మండలంలోని అంబం(ఆర్) శివారులో గల మోడల్ స్కూల్‌లో అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 27న ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ టి. చెన్నప్ప తెలిపారు. ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. సందేహాల నివృత్తి కోసం 94922 07033కు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు.

అంబేడ్కర్ జయంత్యోత్సవాలు



రుద్రూర్: హంగర్గలో శుక్రవారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంత్యోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం ఆయన చేసిన కృషిని గుర్తు చేశారు. అనంతరం ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ నిర్వహించారు.

దేవేంద్రుల పల్లె వన్నెల్(బి)



నాగంపేట్‌లో ముత్యాల పోచమ్మ ఆలయం



వన్నెల్(బి)లో దేవమ్మ ఆలయం

బాల్కొండ: మండలంలోని వన్నెల్(బి) గ్రామస్తుల ఆరాధ్య దైవ్యం దేవమ్మ. ఆ గ్రామంలో ప్రతి ఇంటిలో ఒకరు దేవేందర్, దేవన్న, దేవాయిల పేరుతో ఉంటారు. ఆ గ్రామ జనాభా 5వేల పైగా ఉంటుంది. 600పైచిలుకు కుటుంబాలు ఉంటాయి. ప్రతి కుటుంబంలో పురుషుల పేరు దేవేందర్ లేదా దేవన్న పేరుతో ఉండగా, మహిళల పేర్లు దేవాయి, దేవక్క పేర్లతో ఉన్నాయి. ఈ తరం పిల్లలకు కూడా ముందుగా ఆ పేరుతో నామకరణం చేసిన తరువాతనే ఇతర పేర్లు పెట్టుకుంటున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. ఆ గ్రామంలో చాలా మంది దేవేందర్‌లు ఉండటం వల్ల ఇంటి పేరుతో పిలిస్తేనే వారిని కచ్చితంగా గుర్తుపట్టడానికి సులువవుతుంది. చాలా మంది పూర్తి పేరుకు బదులు ఇంటి పేరులతో ఎక్కువ మందిని పిలుచుకుంటారు. ప్రతి శుక్రవారం దేవమ్మకు పూజలు నిర్వహిస్తారు. దేవమ్మ కరుణతో గ్రామస్తులం సల్లంగా ఉన్నామని ఆ గ్రామస్తులు నమ్మకంగా చెబుతున్నారు.

ముత్తెన్నల ఊరు నాగంపేట్..

అలాగే ముప్కాల్ మండలం నాగంపేట్ గ్రామస్తుల ఆరాధ్య దైవం ముత్యాల పోచమ్మ కావడంతో ఆ గ్రామంలో ప్రతి ఇంటిలో ముత్తెన్న, ముత్తెమ్మలతో పేర్లు ఉంటాయి. గ్రామం నడిబొడ్డున ముత్యాల పోచమ్మ ఆలయం ఉంది. ప్రతి ఆదివారం ఘనంగా పూజలు నిర్వహిస్తారు. ప్రతి ఇంటి పిల్లావాడి పుట్టు వెంట్రుకలు ఈ అమ్మ వారికే కానుకగా సమర్పిస్తారు.

ప్రతి ఇంటిలో పేరు ఉంటుంది



వన్నెల్(బి)లోని ప్రతి ఇంటిలో దేవమ్మ లేదా దేవేందర్ లేదా దేవన్న లాంటి పేరు తప్పకుండా ఉంటుంది. ఇప్పటి పిల్లలకు కూడా ఆ పేరుతో పేరు పెట్టాకే వేరే పేర్లతో పిలుచుకుంటాం. దేవమ్మ కరుణతో అందరం సల్లంగా ఉంటున్నాం. – ఏనుగు దేవేందర్, వన్నెల్(బి)

కనీసం ఒకరికి 'ముత్తెన్న' పేరు

నాగంపేట్ గ్రామంలో ముత్యాల పోచమ్మ ఆలయం ఉండటంతో మా ఆరాధ్య దైవంగా భావిస్తాం. అందుకే ప్రతి ఇంటిలో ముత్తెన్న పేర్లు పెట్టుకుంటాం. ఆడవాళ్లకు కూడా ముత్తెమ్మ అనే పేరు ఉంటుంది. పేర్లు కూడా ఆనవాయితీగా వస్తున్నాయి. – పేట్ల ముత్తెన్న, నాగంపేట

పర్యాటకులపై ఉగ్రదాడి పిరికిపంద చర్య

సాక్షి నెట్‌వర్క్ : జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడాన్ని పిరికిపంద చర్య అభివర్ణిస్తూ జిల్లా వ్యాప్తంగా మృతులకు నివాళులర్పించారు. కొవ్వొత్తులతో ర్యాలీలు నిర్వహించారు. ఉగ్రవాదుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. దాడులకు పాల్పడిన వారికి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పాక్‌తో మెతకవైఖరి తగదన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కమ్మర్‌పల్లిలో ఉగ్రదాడికి నిరసనగా బంద్ చేపట్టారు.



బోధన్‌లో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



పహల్గాం మృతులకు మౌనం పాటించి నివాళులు అర్పిస్తున్న బోధన్ యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు



ఆర్మూర్‌లో .. కుల్ జమాతీ కమిటీ సభ్యులు



ఆర్మూర్‌టౌన్: నల్లబ్యాడ్జీలతో న్యాయవాదుల నిరసన



వర్నిలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



వేల్పూర్‌లో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో నివాళి





కమ్మర్‌పల్లిలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వీహెచ్‌పీ కార్యకర్తలు.. మూసి ఉంచిన దుకాణాలు

'మానవత్వమే మహోన్నత ధర్మం'

బోధన్: మానవత్వమే అన్ని ధర్మాలకంటే మహోన్నతమైందని మహారాష్ట్ర ప్రాంత బేట్‌మోగ్రా వీరశైవ మఠాధిపతి సద్గురు సిద్ధదయాళ్ శివాచార్య మహారాజ్ ప్రబోధించారు. అన్ని జీవరాసుల కంటే మానవ జన్మ ఉన్నతమైందని, దైనందిన జీవితంలో పుణ్యకార్యాలు చేసి మానవ జన్మను సార్థకం చేసుకోవాలని అన్నారు. ఎలాంటి అసమానత భావనలేని వీరశైవ లింగాయత్ ధర్మం ఆచరించాలన్నారు. వీరశైవ సమాజ్ (వీరశైవ లింగాయత్ సమాజ్, జంగమ సమాజ్ ఉమ్మడిగా) బోధన్ శాఖ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని ఏకచక్రేశ్వరాలయంలో ఏర్పాటు చేసిన 20వ అఖండ శివనామ సప్తాహం ఆరో రోజు శుక్రవారం విచ్చేసిన మఠాధిపతి భక్తుల నుద్దేశించి ప్రవచనాలు చేశారు.

వీరశైవ ధర్మ సంప్రదాయం ఆచరించాలి

బోధన్: ప్రతి ఒక్కరూ వీరశైవధర్మ సంప్రదాయాన్ని ఆచరించాలని సాలూర గ్రామానికి చెందిన వీరశైవుల గురువు తిప్పయ్యప్ప మహరాజ్ ప్రబోధించారు. వీరశైవ లింగాయత్ సమాజ్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపంలో 6వ అఖండ శివనామ సప్తాహం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం సప్తాహం రెండో రోజు శిబిరంలో ఆ శివనామ సంకీర్తన, పరమ రహస్య గ్రంథ సామూహిక పారాయణం, మంగళ హారతి కార్యక్రమాలు కొనసాగాయి.



ఆధ్యాత్మిక అంశాలను ప్రబోధిస్తున్న శివాచార్య



ప్రవచనాలను ఆలకిస్తున్న వీరశైవ సమాజ్ మహిళలు

ఆర్మూర్ పట్టణంలో తనిఖీలు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో శుక్రవారం రాత్రి ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. పాతబస్టాండ్, హోటల్స్, పాన్‌షాపులతో పాటు పలు దుకాణాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా నిషేధిత మత్తు పదార్థాలు వాడితే చర్యలు తప్పవన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



రుద్రూర్: జాకోరా సహకార సంఘం పరిధిలోని శ్యామ్‌రావ్ తండాలో శుక్రవారం జొన్న కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు సురేష్ బాబా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర అందించడానికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సింగిల్ విండో చైర్మన్ బర్దావల్ దశరథ్, డైరెక్టర్లు కెంపుల సాయిలు, నరెడ్ల చిన్న సాయిలు, యామినీబాయి, గైని గంగామణి, మాజీ జెడ్పీటీసీ హరిదాస్, నేతలు శనిగరం కిషన్, మూడ్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక



యూనియన్ ప్రతినిధులను సన్మానిస్తున్న సభ్యులు

రెంజల్(బోధన్): రెంజల్ మండల ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెంజల్‌లో సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా నీలం సాయిలు, ఉపాధ్యక్షుడిగా నజీబ్, కోశాధికారిగా మొయిన్‌షాలతో పాటు కార్యవర్గ సభ్యులుగా మోహన్, మహేశ్, సజ్జు, అజాంలను ఎన్నుకున్నారు. వీరితో పాటు మరి కొందరిని కార్యవర్గ సభ్యులుగా నియమించారు. అనంతరం సన్మానించారు. గ్రామ కమిటీ సభ్యులు ఈర్ల రాజు, ప్రతినిధులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

వేల్పూర్: పడగల్ ప్రాథమిక పాఠశాల నుంచి గురుకుల పాఠశాలలకు 15 మంది విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం సరోజిని శుక్రవారం తెలిపారు. పాఠశాలలో ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయుల కృషి, స్థానిక వీడీసీ సహకారంతో తమ స్కూలు నుంచి ప్రతి ఏటా 15 నుంచి 20 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలలకు ఎంపికవుతున్నారని ఆమె చెప్పారు. ఉపాధ్యాయులు శంకర్, రేణుక, రాకేశ్, నాగరాజు, ప్రవీణ్, అజయ్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



ఆర్మూర్‌టౌన్: ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల కాటుకు గురికావద్దని మెడికల్ ఆఫీసర్ ఫిర్దోస్ ఫాతిమా అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం వరల్డ్ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దోమలు లేవు – జ్వరం లేదు, శుభ్రత పాటించు – మలేరియా తూట్లు తెంచు వంటి నినాదాలతో ప్రజల్లో చైతన్యం కలిగించారు. దోమల వల్లనే మలేరియా, డెంగీ వంటి వ్యాధులు వస్తాయని అన్నారు. ప్రజలు జాగ్రత్తలు పాటిస్తే సరిపోతుందన్నారు. హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, సురేష్, సిబ్బంది రాజవ్వ, విజయ, కమల, సౌందర్య, శ్యామల, స్వాతి, విజయశ్రీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను వదిలే ప్రసక్తే లేదు



కొవ్వొత్తులతో ర్యాలీలో పాల్గొని నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి

ఆర్మూర్‌టౌన్ : దేశంపై దాడి చేసిన ఉగ్రవాదులను వదిలే ప్రసక్తే లేదని, భారత ప్రభుత్వం సరైన సమాధానం చెబుతుందని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలో శివాజీ చౌక్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ.. కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఉగ్రవాదుల దాడిని ప్రతి భారతీయుడు ఖండించాలన్నారు. భారతదేశ పౌరులు ఐక్యత చూపాల్సిన సమయం వచ్చిందన్నారు. పార్టీలకు అతీతంగా ఉగ్రవాదులపై పోరాడాలన్నారు.

'వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలి'



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రైడ్స్ సభ్యులు

రుద్రూర్: రుద్రూర్‌లో వ్యవసాయ కళాశాల(బీఎస్సీ, అగ్రికల్చర్), హాస్టల్, జూనియర్ కళాశాలల మంజూరుకు కృషి చేయాలని రైడ్స్(రుద్రూర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ ఎడ్యుకేషనల్ సొసైటీ) ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన రైడ్స్ కమిటీ కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే సన్మానించారు. సింగిల్ విండో చైర్మన్ బి.సంజీవరెడ్డి, మాజీ చైర్మన్ పత్తి రాము, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు అక్కపల్లి నాగేందర్, రైడ్స్ అధ్యక్షులు కృష్ణ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పార్వతి శేఖర్, ఉపాధ్యక్షులు నూతిపల్లి బాలరాజ్, తదితరులు పాల్గొన్నారు.

'వరంగల్ సభను విజయవంతం చేయాలి'



వర్నిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ జిల్లా కో–ఆర్డినేటర్ ఎజాస్, నేతలు

రుద్రూర్ : వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ పార్టీ 25వ రజతోత్సవ సభకు పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్వీ జిల్లా కో–ఆర్డినేటర్ ఎజాస్ కోరారు. వర్ని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27న మండల పరిధిలోని అన్ని గ్రామాల నుంచి ఉదయం 7 గంటలకు వర్ని మండల కేంద్రానికి వచ్చి జెండావిష్కరణ చేసి సభకు వెళ్లాలని అన్నారు. కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని, బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారని అన్నారు. నాయకులు ప్రవీణ్ యాదవ్, జంగం రాచప్ప, షేక్ ఉస్మాన్, ప్రభాకర్, ఆనంద్ గౌడ్, మహేందర్ రెడ్డి, అనిల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు నిర్మాణాలు ఆపండి



వినతి పత్రం అందజేస్తున్న హౌసింగ్ బోర్డు అభివృద్ధి కమిటీ సభ్యులు

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ హౌసింగ్ బోర్డ్ కాలనీ పార్కులో చేపట్టిన వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని వెంటనే ఆపాలని హౌసింగ్‌బోర్డు అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కమిషనర్ రాజుకు ఈ మేరకు వారు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ...పార్కులో ఇదివరకే ఒక వాటర్ ట్యాంకు ఉందని, రెండో వాటర్ ట్యాంకు నిర్మాణం చేపట్టడం వల్ల పిల్లలు ఆడుకోవడానికి స్థలం లేకుండా పోతుందని వాపోయారు.పనులు ఆపకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ విషయంలో ఎమ్మెల్యే కలగజేసుకొని చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లింగాగౌడ్, హౌసింగ్‌బోర్డు కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు లింబాద్రి గౌడ్, పూజ నరేందర్, పండిత్ పవన్ పాల్గొన్నారు.

తాళ్లరాంపూర్ కల్లు గీత కార్మికుల ధర్నా



ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న నేతలు

ఆర్మూర్: తాళ్లరాంపూర్ గ్రామ గౌడ మహిళలను గుడిలోకి రానివ్వకుండా, ఈత వనాన్ని తగలబెట్టిన ఘటనను నిరసిస్తూ కల్లు గీత కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ.. 'వీడీసీలు చేసిన హేయమైన చర్య ఇది, రాజ్యాంగ విరుద్ధం, తగిన చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని ముమ్మరం చేస్తాం' అని హెచ్చరించారు. అనంతరం ఆర్డీవో రాజాగౌడ్‌కు వినతి పత్రం అందజేసి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు పెద్ది వెంకటరాములు, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, అంబాల నారాయణ గౌడ్, సదానందం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ సరఫరాలో అంతరాయం

నవీపేట: మండలంలోని కోస్లీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహించడంతో ఆ పరిధిలోని గ్రామాలలో శనివారం కరెంట్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ అశోక్ శుక్రవారం పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయత్రం 6 గంటల వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

28 నుంచి ఉచిత యోగా శిబిరం

నిజామాబాద్ రూరల్: నగరంలోని సుభాష్‌నగర్‌లో గల దయానంద యోగ కేంద్రం ఈ నెల 28 నుంచి ఉచిత యోగ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు యోగాచార్యులు రాంచందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9 నుండి 15 ఏళ్ల బాలబాలికలు రావచ్చన్నారు. పురుషులకు ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు, మహిళలకు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 9849845550, 9398504054 నెంబర్లను సంప్రదించాలన్నారు.

సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	మ్యాడ్‌స్క్వేర్(తెలుగు)-11.10, 7.45, మధురం-1.55 జాక్(తెలుగు) 4.50, డియర్ ఉమ-10.30
స్క్రీన్-2	ఓదెల-2-10.00, 1.05, 4.10, 7.15, 10.20
స్క్రీన్-3	జాక్(తెలుగు)-11.15, 8.40 మ్యాడ్ స్క్వేర్(తెలుగు)-2.10, 5.10
స్క్రీన్-4	అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి-10.30, 1.30, 4.30, 7.30,10.30



మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సెడ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	98,000	వెండి(కిలో)	1,03,000
22 క్యారెట్స్	90,465		

– నిజామాబాద్ బిజినెస్